సాక్షి అనంతపురం

గురువారం । 1 । ఆగస్టు । 2024



చీనీ టన్ను రూ.17 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.17 వేలు పలికాయి.



టమాట కిలో రూ.29

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.29 పలికింది. కనిష్టం రూ.13, సరాసరి రూ.20 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.1°/23.8°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

తుంగభద్ర డ్యాంకు కొనసాగుతున్న వరద



తుంగభద్ర జలాశయం గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయానికి వరద నీటి చేరిక కొనసాగుతోంది. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 74,095 క్యూసెక్కులుగా నమోదవుతోంది. కాలువలకు వదిలే నీటితో కలిపి అవుట్ ఫ్లో 1,32,760 క్యూసెక్కులుగా ఉంది. డ్యాం 33 క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీరు వదులుతున్నారు. జలాశయంలో 105.788 టీఎంసీల పూర్తి నీటి నిల్వ సామర్థ్యానికి గానూ 99.040 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 1,633 అడుగుల నీటి మట్టానికి గాను 1,631.30 అడుగులకు నీరు చేరింది. ఇదిలా ఉంటే హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దు 105వ కిలోమీటర్ వద్ద 1,138 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

సమగ్ర శిక్ష ఏపీసీగా నాగరాజు



ఏపీసీగా బాధ్యతలు తీసుకున్న నాగరాజుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగులు

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష ఏపీసీ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడంలో ఎట్టకేలకు సందిగ్ధం వీడింది. విద్యాశాఖ ఏడీ నాగరాజుకు ఏపీసీ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో బుధవారం ఆయన బాధ్యతలు తీసుకున్నారు. విద్యా వ్యవస్థలో కీలకమైన సమగ్ర శిక్ష ప్రాజెక్టుకు జిల్లాలో ఏపీసీ లేకపోవడం, ఇన్‌చార్జ్ ఇచ్చినా డీఈఓ వరలక్ష్మీ తీసుకోకపోవడంతో విద్యాభివృద్ధి కార్యక్రమాలు కుంటు పడ్డాయి. దీనికితోడు ఉద్యోగుల జీతాల బిల్లుల విషయంలోనూ ఆటంకం ఏర్పడింది. ఈ ఇబ్బందులపై గత నెల (జూలై) 29న 'సాక్షి'లో 'కీలక అధికారి లేని సమగ్ర' శీర్షికతో కథనం వెలువడింది. ఈ క్రమంలో సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు, కలెక్టర్ వినోద్‌కుమార్ స్పందించారు. విషయాన్ని తీవ్రంగా పరిగణించి మరోమారు డీఈఓ వరలక్ష్మీనే బాధ్యతలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఆ పోస్టుకు వెళ్లేందుకు ఇష్టం లేని డీఈఓ.. కలెక్టర్‌ను వ్యక్తిగతంగా కలిసి తనకు ఆరోగ్య సమస్యలు ఉన్నాయంటూ విన్నవించారు. దీంతో ఏడీ నాగరాజుకు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

డీఎస్పీల బదిలీ

అనంతపురం: ఉమ్మడి జిల్లాలో పని చేస్తున్న పలువురు డీఎస్పీలు బదిలీ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 96 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ ద్వారకా తిరుమల రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం పీటీసీలో పనిచేస్తున్న డీఎస్పీ కే. వెంకటేశ్వర రావు తూర్పు గోదావరి దిశా ఉమెన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. నెల్లూరు ఎస్‌బీ డీఎస్పీగా ఉన్న ఆర్ల శ్రీనివాసులును పెనుకొండ డీఎస్పీగా బదిలీ చేశారు. అప్పా డీఎస్పీ (పీటీసీ అనంతపురం)గా ఉన్న హుస్సేన్ పీరా జమ్మలమడుగు డీఎస్పీగా బదిలీ అయ్యారు. గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్ రెడ్డి, కళ్యాణదుర్గం డీఎస్పీ బి. శ్రీనివాసులు, పుట్టపర్తి డీఎస్పీ ఆర్. వాసుదేవన్‌లను పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.

నెట్టికంటుడి హుండీ కానుకల లెక్కింపు

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి హుండీ కానుకల లెక్కింపు ప్రక్రియ బుధవారం చేపట్టారు. 36 రోజులకు గానూ రూ.21,78,764 నగదు, అన్నదానం హుండీ ద్వారా రూ.18,202 నగదును స్వామివారికి భక్తులు సమర్పించినట్లు ఆలయ ఈఓ భద్రాజీ తెలిపారు. అలాగే 121 అమెరికన్ డాలర్లు ఉన్నాయన్నారు.

నేడు హంద్రీనీవాకు నీరు విడుదల

అనంతపురం సెంట్రల్: శ్రీశైలం జలాశయం నుంచి హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టుకు గురువారం నీటిని విడుదల చేయనున్నట్లు హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఎస్‌ఈ దేశానాయక్ తెలిపారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 209.499 టీఎంసీలు నీరు ఉండగా, 3.01 లక్షల క్యూసెక్కుల భారీ ఇన్‌ఫ్లో వస్తోంది. 3.09 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

❐ ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌కు చెందిన ఫరీద్ అనంతపురంలోని ఓ బొటిక్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. స్వగ్రామం వెళ్లేందుకు ఇటీవల అనంతపురం రైల్వేస్టేషన్‌లో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. బోగీలో కూర్చునేందుకు కాదు కదా.. నిలబడేందుకు కూడా చోటు లేదు. ఇబ్బందులు పడుతూనే విజయవాడ వరకూ వెళ్లాడు. ఈ క్రమంలో నిల్చోవడం కష్టంగా మారి బోగీలోని బాత్‌రూం పక్కన స్థలం ఉంటే కూర్చున్నాడు. కొంతసేపటికే దుర్వాసన తట్టుకోలేక మళ్లీ ముందు నిల్చున్న చోటుకే వెళ్లి ఎలాగోలా భువనేశ్వర్ వరకూ ప్రయాణించాడు.

❐ అనంతపురం రైల్వేస్టేషన్ నుంచి శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తికి నిత్యం 300 మందికి పైగా రైలులో వెళ్తుంటారు. ఉన్న రెండు జనరల్ బోగీలు అప్పటికే ప్రయాణికులతో కిక్కిరిసిపోతుండడంతో వీరి ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. బెంగళూరుకు వెళ్లే ప్రయాణికుల పరిస్థితీ ఇలాగే ఉంటోంది. నెల ముందు రిజర్వేషన్ చేయించుకుంటే ఫర్వాలేదు. అత్యవసరంగా వెళ్లాలంటే మాత్రం చుక్కలు కనిపిస్తున్నాయి. వీరే కాదు.. నిత్యం ఎంతో మంది అవస్థలు పడుతూనే రైళ్లలో ప్రయాణాలు చేస్తున్నారు. రైలు ప్రయాణం అంటేనే సామాన్యుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

మచిలీపట్నం-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలులో ఎక్కేందుకు పోటీపడుతున్న ప్రయాణికులు



రైలు ప్రయాణం.. సామాన్యులకు నరకం

- సామాన్యుల గోడు పట్టని రైల్వేశాఖ
- జనరల్ కోచ్‌లలో నిలబడేందుకూ చోటుండని పరిస్థితి
- అవస్థల నడుమే రాకపోకలు సాగిస్తున్న పేద, మధ్యతరగతి ప్రజలు
- జనరల్ బోగీలను పెంచకపోవడంపై ప్రయాణికుల ఆగ్రహం

జిల్లా మీదుగా రోజూ రాకపోకలు సాగించే రైళ్లు **60**

ప్రయాణికులు: **25**వేల మంది

అనంతపురం: రైళ్లలో జనరల్ బోగీలు నరకానికి నకళ్లుగా మారాయి. కిక్కిరిసిన బోగీల్లో ఒకరిపై ఒకరు కూర్చుని, నిల్చొని ప్రయాణించడం సర్వ సాధారణంగా మారింది. వందల కిలోమీటర్ల దూరం నిలబడి ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో మహిళలు, పిల్లలు వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు. ఏసీ కోచ్‌లు, వందే భారత్ రైళ్లపై ఉన్న శ్రద్ధ సామాన్యులు వెళ్లే జనరల్ బోగీల పైనా పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

కేవలం రెండే జనరల్ బోగీలు..

ఉమ్మడి జిల్లా పరిధిలో ప్రధానంగా గుంతకల్లు, గుత్తి, ధర్మవరం రైల్వే జంక్షన్ల మీదుగా వెళ్లే రైళ్లు అధికంగా ఉన్నాయి. 60 ఎక్స్‌ప్రెస్ రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రతి రైలులో కేవలం రెండే రెండు జనరల్ బోగీలు ఉంటున్నాయి. ఏళ్ల తరబడి ఇదే దుస్థితి. ప్రయాణికుల రద్దీకనుగుణంగా రైల్వే శాఖ జనరల్ బోగీలు పెంచడం లేదు. సాధారణ ప్రయాణికులు కనీసం నిలబడేందుకు కూడా వీటిలో స్థలం ఉండడం లేదు. తాగునీటి వసతి సరిగా ఉండదు. మరుగుదొడ్లు అధ్వానంగా ఉంటున్నాయి.

ప్యాసింజర్ రైళ్ల తగ్గింపు

ఒకప్పుడు పేదల బండిగా ఉన్న రైలు ఇప్పుడు వారికి అందని ద్రాక్షగా మారుతోంది. కేంద్ర ప్రభుత్వం ఎక్స్‌ప్రెస్‌లు, సూపర్‌ఫాస్ట్, వందేభారత్ ప్రవేశపెట్టాక ప్యాసింజర్ రైళ్లను తగ్గించేయడమే కాకుండా ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలను కాలక్రమేణా కుదిస్తూ వస్తోంది. ప్రయాణికులకు సౌకర్యాలు పెంచుతున్నామంటూనే రైలు ప్రయాణాన్ని పేదలకు దూరం చేస్తోంది.

అవస్థలు మరచిపోలేకున్నా



స్నేహితులతో కలిసి ఇటీవల అరకు వెళ్లా. రిజర్వేషన్ చేయించుకున్నా వెయిటింగ్‌లో సీట్లు దక్కలేదు. దీంతో జనరల్ బోగీలో ప్రయాణించాం. అక్కడ విపరీతమైన రద్దీ ఉండింది. అయినా, ఇబ్బందులు పడుతూనే ఎలాగోలా విశాఖపట్నం చేరుకున్నాం. ఆ అవస్థలు ఇప్పటికీ మరచిపోలేకున్నా. రైలు ప్రయాణమంటేనే భయమేస్తోంది.

– ప్రభాకర్, అనంతపురం

సౌకర్యాలు మెరుగు పడాలి



మధ్య తరగతి ప్రజలే ఎక్కువగా పన్నులు కడుతున్నారు. అలాంటి వారికి సౌకర్యాలు తక్కువ య్యాయి. జనరల్ బోగీలను పెంచి సామాన్యులకు రైలు ప్రయాణాన్ని సులభతరం చేయాలి. సాంకేతిక పరిజ్ఞానం ఉన్న వారే రిజర్వేషన్ చేయించుకుంటున్నారు. పేద, మధ్యతరగతి వర్గాల శ్రేయస్సు దృష్ట్యా రైళ్లలో సౌకర్యాలు మెరుగుపరచాలి.

– అక్కిరెడ్డి, అనంతపురం

జనరల్ బోగీలు పెంచాలి



కొన్ని రోజుల క్రితం షిర్డీ నుంచి అనంతపురానికి రైలులో ప్రయాణించాం. రిజర్వేషన్ చేయించుకున్నా సీటు కన్ఫర్మ్ కాకపోవడంతో జనరల్ బోగీలో వచ్చాం. విపరీతమైన రద్దీ ఉంది. నిల్చోవడానికి కాళ్లు కింద పెట్టాలన్నా కుదర్లేదు. ఒంటి కాలిపైనే ప్రయాణించాం. జనరల్‌లో రెండు బోగీలే ఉండడంతో అవస్థలు పడ్డాం. బోగీలను పెంచాలి.

– ప్రకాష్ రెడ్డి, అనంతపురం

కేంద్ర ప్రభుత్వం తీరు అన్యాయం



సామాన్యులకు రైలు ప్రయాణాన్ని దూరం చేసేలా తీసుకుంటున్న నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి. స్లీపర్ కోచ్‌లు, ఏసీ కోచ్‌ల ధరలు అందని ద్రాక్షలా మారాయి. ప్లాట్‌ఫాం పొడవు లేదని బోగీలను పెంచకపోవడం సరికాదు. దశాబ్దాల తరబడి ఎక్స్‌ప్రెస్‌లలో రెండు జనరల్ బోగీలనే కొనసాగిస్తుండటం అన్యాయం.

– సోమశేఖర్, అనంతపురం

రద్దు, కుదింపులతో ఇబ్బందులు



అనంతపురం రైల్వేస్టేషన్ నుంచి వెళ్తున్న ఓ రైలులో కిక్కిరిసిన జనరల్ బోగీ

- బెళగావి నుంచి భద్రాచలం మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ భద్రాచలం వెళ్లే భక్తులతో పాటు సికింద్రాబాద్‌కు రాకపోకలు సాగించే వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. ఇలాంటి రైలును రద్దు చేశారు.
- హుబ్లీ- విజయవాడ- హుబ్లీ ఎక్స్‌ప్రెస్ రైలు విజయవాడకు వెళ్లడానికి ఎంతో అనువుగా ఉండేది. ఈ సర్వీసు రద్దు చేయడంతో గుంతకల్లు మీదుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.
- కరోనా సమయంలో రద్దయిన బెంగళూర్–విజయవాడ ప్యాసింజర్ రైళ్లు నేటికీ పట్టాలెక్క లేదు. ఈ రైళ్లు విజయవాడ, బెంగళూరుకు రాకపోకలు సాగించే ప్రయాణికులకు తక్కువ చార్జీలతో సౌకర్యంగా ఉండేవి. గుంతకల్లు–ధర్మవరం ప్యాసింజర్ రైలు కూడా రద్దు చేయడంతో అవస్థలు వర్ణనాతీతంగా మారాయి.
- బెంగళూర్ నుంచి భువనేశ్వర్ వెళ్లే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలులో 12 స్లీపర్‌క్లాస్ బోగీలు ఉండేవి. ప్రస్తుతం వాటిని ఆరుకు కుదించి, ఏసీ బోగీలను పెంచారు.
- ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ నుంచి ఛత్రపతి శివాజీ టెర్మినల్ (ముంబై)కు రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్‌లో ప్రస్తుతం కేవలం రెండు స్లీపర్, రెండు జనరల్ బోగీలు మినహా అన్ని ఏసీ కోచ్‌లే.
- వాస్కోడిగామా ఎక్స్‌ప్రెస్‌లో ఎక్కువగా కార్మికులు, కూలీలు ప్రయాణిస్తుంటారు. ఈ రైలు గతంలో 12 స్లీపర్ బోగీలతో రాకపోకలు సాగించేది. ప్రస్తుతం రెండు స్లీపర్, రెండు జనరల్ బోగీలే ఉంటున్నాయి.
- బెంగళూర్ నుంచి న్యూఢిల్లీ వెళ్లే కర్ణాటక ఎక్స్‌ప్రెస్‌లో దాదాపు 12కి పైగా స్లీపర్ బోగీలు ఉండేవి. ప్రస్తుతం వాటిని 7కి కుదించారు.
- యశ్వంతపుర నుంచి గోరఖ్‌పూర్ వెళ్లే గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు కార్మికులు, కూలీలకు ఉపయోగకరంగా ఉండేది. ఈ రైలులో కేవలం 4 స్లీపర్ బోగీలు, 2 జనరల్ బోగీలను ఏర్పాటు చేశారు.

పింఛన్ల పంపిణీ సజావుగా జరగాలి

- కలెక్టర్ వి.వినోద్‌కుమార్



అనంతపురం అర్బన్: ఎన్‌టీఆర్ భరోసా పథకం కింద పింఛన్ల పంపిణీ సజావుగా జరగాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం 6 గంటలకు కార్యక్రమం ప్రారంభం కావాలని చెప్పారు. బుధవారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తొలి రోజునే పింఛన్లు వంద శాతం పంపిణీ అయ్యేలా చూడాలన్నారు. పంపిణీ సజావుగా జరిగేలా నియోజకవర్గ, మండల స్థాయిలో ప్రత్యేక అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పింఛనుదారులు ఎవరైనా మరణించి ఉంటే నమోదు చేయాలని చెప్పారు. పంపిణీలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అర్హులందరికీ పింఛను అందించాలన్నారు. గత నెలలో పింఛను తీసుకోని వారు ఎవరైనా ఉన్నారా? ఉంటే వారు ఎందుకు తీసుకోలేదో తెలుసుకోవాలన్నారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉంటే అక్కడికే వెళ్లి అందించాలని ఆదేశించారు. వీసీలో డీపీఓ ప్రభాకర్ రావు, డీఆర్‌డీఏ పీడీ ఓబుళమ్మ, మునిసిపల్ కమిషనర్లు, ఆర్‌డీఓలు, తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లు ఎందుకు తగ్గాయి?

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో మార్కెటింగ్‌శాఖ పనితీరుపై కలెక్టర్ వినోద్‌కుమార్ బుధవారం సమీక్ష నిర్వహించారు. ఏడీఎం పి.సత్యనారాయణచౌదరితో కలిసి జిల్లాలో ఉన్న 9 మార్కెట్ కమిటీల సెక్రటరీలతో సమీక్షించారు. ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో మార్కెట్‌యార్డులు, చెక్‌పోస్టుల ద్వారా పన్ను వసూళ్లు తగ్గడంపై ఆరా తీశారు. పంట దిగుబడులు తగ్గడం, సిబ్బంది కొరత కారణంగా తగ్గినట్లు ఏడీఎం తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆదాయ వనరుల పెంపు కోసం 'విజిలెన్స్'ను పటిష్టం చేయాలని ఆదేశించారు. గోదాముల నుంచి పెండింగ్ బకాయిలు వసూలు చేయాలన్నారు. ఖాళీగా ఉన్న గోదాములను బాడుగకు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మార్కెట్ యార్డుల్లో అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. చీనీ, చింత, మిరప లాంటి వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు దక్కేలా 'ఈ-నామ్' విధానాన్ని పటిష్టం చేయాలని ఆదేశించారు. మల్టీ పర్పస్ గోదాముల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. చీనీతో పాటు డ్రాగన్, ఇతరత్రా నాణ్యమైన ఫలసాయం ఇతర ప్రాంతాలకు ఎగుమతులు జరిగేలా ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్. జయలక్ష్మి, డీఈ రఘునాథ్, సెక్రటరీలు పాల్గొన్నారు.

రైతు ప్రాణం తీసిన ఎల్‌ఎం నిర్లక్ష్యం

నార్పల: విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఓ లైన్‌మెన్ నిర్లక్ష్యం రైతు ప్రాణాన్ని బలిగొంది. వివరాలు.. మండలంలోని నల్లపరెడ్డిపల్లికి చెందిన రైతు రమణారెడ్డి (55) తనకున్న 3.50 ఎకరాల పొలంలో చీనీ, వరి పంటల సాగు చేపట్టాడు. కొన్ని రోజులుగా రమణారెడ్డి పొలంతో పాటు చుట్టుపక్కల రైతుల పొలాల్లో విద్యుత్ మోటార్లకు అనుసంధానించిన ట్రాన్స్‌ఫార్మర్‌కు తరచూ ఎగ్జిట్ ఫ్యూజ్‌లు ఎగిరి పోతుండడంతో మరమ్మతు చేయాలని లైన్‌మెన్ షకూర్‌ను కోరారు. దీంతో రైతు నారాయణరెడ్డి పొలం వద్ద విద్యుత్ లైన్‌కు కంప చెట్లు తగులుతున్నాయని వాటిని తొలగిస్తే తానొచ్చి మరమ్మతులు చేస్తానని తెలిపాడు. దీంతో రమణారెడ్డి, మరికొందరు రైతులు బుధవారం కంప చెట్ల తొలగింపు పనులు చేపట్టారు. ఈ క్రమంలో రైతుల అభ్యర్థన మేరకు ఎల్‌ఎం షకూర్ ఎల్‌సీ ఇచ్చాడు. రైతు లక్ష్మీదేవి పొలం వద్ద గాలికి కంపచెట్లు తగిలి విద్యుత్ లైన్ ఒకదానితో ఒకటి తగులుకోవడం గమనించిన రమణారెడ్డి స్తంభం పైకి ఎక్కి సరిచేస్తుండగా విద్యుత్ సరఫరా జరిగి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని.. మృతదేహాన్ని కిందకు దింపారు. పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే తన తండ్రి మృతిచెందాడని రమణారెడ్డి కుమారుడు నాగేశ్వరరెడ్డి చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



విద్యుత్ స్తంభంపైనే మృతి చెందిన రమణారెడ్డి

ఎస్‌ఎంసీ ఎన్నికలకు వేళాయె

- స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు షెడ్యూలు విడుదల
- నేడు నోటిఫికేషన్.. 5న ఓటరు జాబితాపై అభ్యంతరాల స్వీకరణ
- 8న ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల ఎన్నిక, అదేరోజు తొలి సమావేశం
- అనుకూలమైన వారిని ఎన్నుకునేందుకు అధికార పార్టీ వ్యూహం



అనంతపురం ఎడ్యుకేషన్: పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికలు ఈనెల 8న నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూలును సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు విడుదల చేశారు. జిల్లాలో మొత్తం 1,734 ప్రభుత్వ యాజమాన్య స్కూళ్లలో ఎస్‌ఎంసీ ఎన్నికలు జరగనున్నాయి. గురువారం (నేడు) ఉదయం 10 గంటలకు నోటిఫికేషన్ విడుదల చేస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు ఓటరు జాబితాను నోటీస్ బోర్డులో ప్రదర్శిస్తారు. 5న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓటర్ జాబితాలపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. 3 గంటలకు తుది ఓటరు జాబితా ప్రదర్శిస్తారు. 8న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సభ్యుల ఎన్నికల ప్రక్రియ పూర్తి చేస్తారు. సభ్యులు 1.30 గంటలకు ఛైర్మన్, వైస్ ఛైర్మన్లను ఎన్నుకుంటారు. 2 గంటలకు ఛైర్మన్, వైస్ ఛైర్మన్లతో పాటు సభ్యులందరితో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. 3 నుంచి 3.30 గంటల వరకు తొలి ఎస్‌ఎంసీ మీటింగ్ నిర్వహిస్తారు. ఈ క్రమంలో అన్నిచోట్లా తమకు అనుకూలమైన వారే ఉండేలా అధికార పార్టీ వ్యూహం రచిస్తోంది.

ప్రతి తరగతి నుంచి ముగ్గురు సభ్యులు

ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ప్రతి తరగతి నుంచి ముగ్గురు ఎస్‌ఎంసీ సభ్యులను ఎన్నుకుంటారు. వీరిలో ఒకరు సామాజికంగా వెనుకబడిన వర్గాలు, మరొకరు బలహీనవర్గాల వారు ఉండాలి. అలాగే ఒక మహిళ కచ్చితంగా ఉండాలి. ఒక తరగతిలో 6 కంటే విద్యార్థులు తక్కువ ఉంటే ఆ సంఖ్యను తదుపరి తక్కువ లేదా అంతకంటే ఎక్కువ తరగతిలో కలపాలి. స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం వహిస్తున్నవారు, హెచ్‌ఎం, టీచర్లు అనర్హులు. ఎన్నికల ప్రక్రియను ప్రధానోపాధ్యాయులు నిర్వహిస్తారు. హెచ్‌ఎం లేనిచోట ఇన్‌చార్జ్ టీచరు, జీపీఎస్ స్కూళ్లల్లో పాఠశాల అధిపతిగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన పని చేస్తున్న సీఆర్టీఎస్ కన్వీనర్‌గా వ్యవహిస్తారు. కనీసం 50 శాతం పేరెంట్స్ హాజరుకావాలి. ఎన్నికల ప్రక్రియ చేతులు ఎత్తడం, వాయిస్ ఓటు ద్వారా జరుపుతారు. అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే రహస్య బ్యాలెట్‌ను వినియోగిస్తారు. విద్యార్థి తల్లి, తండ్రి, సంరక్షకుడిలో ఒకరు మాత్రమే ఎన్నికల్లో పాల్గొనేందుకు అర్హులు. తల్లిదండ్రులకు వేర్వేరు తరగతుల్లో పిల్లలుంటే వారు ఆయా తరగతుల ఎన్నికల్లో పాల్గొనవచ్చు. సభ్యులుగా ఎన్నికైన వారు ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ను ఎన్నుకుంటారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తల్లిదండ్రులు కాకుండా ఇతర వ్యక్తులు ఎన్నికల్లో పాల్గొనకూడదు. ఎన్నికల సమయంలో వారిని ప్రాంగణంలోకి అనుమతించకూడదు. ఎన్నుకున్న సభ్యుడి పదవీకాలం రెండేళ్లు.

ఎస్‌ఎంసీ కమిటీ బాధ్యతలు..

రెండు నెలలకోసారి కమిటీ సమావేశం ఏర్పాటు కావాలి. ఎవరైనా సభ్యుడు ప్రత్యేక అజెండాతో సమావేశం ఏర్పాటు చేయమని కోరితే ఛైర్‌పర్సన్‌ను సంప్రదించి హెచ్‌ఎం ఏర్పాటు చేస్తారు. మధ్యాహ్న భోజన కమిటీ, విద్యాసంబంధ విషయాల సమీక్ష కమిటీ, నిధుల వినియోగ కమిటీ, సోషల్ ఆడిట్ వంటి అనుబంధ కమిటీలను ఎస్‌ఎంసీలు ఏర్పాటు చేస్తాయి. ఎస్‌ఎంసీ, అనుబంధ కమిటీల సమావేశ మినిట్స్‌ను రికార్డుల్లో నమోదుచేసి సభ్యులందరూ చదువుకునేలా అందుబాటులో ఉంచాలి. విద్యార్థులు నేర్చుకున్న అంశాలను పరిశీలించాలి. విద్యార్థులు, టీచర్ల హాజరును పరిశీలించాలి. ఏవైనా తేడాలను గుర్తిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.గ్రామంలో బడి వయసు బాలబాలికలను పాఠశాలల్లో చేర్పించాలి. డ్రాపౌట్స్ కాకుండా చూడాలి. ప్రత్యేక అవసరాల పిల్లలు, బడిమానిన పిల్లలను బడుల్లో చేర్పించాలి. పాఠశాల సిబ్బంది హాజరు, బోధనను సమీక్షించాలి. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించాలి. పాఠశాల జమా ఖర్చుల జాబితా తయారుచేయాలి.

విద్యారంగ సమస్యలు వెంటనే పరిష్కరించాలి


కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: పాఠశాల విద్యారంగ సమస్యలు సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ ఏఓ ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య మాట్లాడుతూ... జీఓ 117 రద్దు చేసి, జీఓ 53 ప్రకారం టీచర్లను కేటాయించాలన్నారు. ప్రీ ప్రైమరీతోపాటు 1 నుంచి 5వ తరగతులు ఒకే పాఠశాలగా నడపాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానం అమలు చేయాలన్నారు. హైస్కూళ్లలో రెండు మీడియంలనూ సమాంతరంగా కొనసాగించాలన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించాలని కోరారు. హైస్కూళ్లలో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలన్నారు. ఒక కిలోమీటరు దూరం పైబడి వచ్చే విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. స్థానిక ప్రాంతాల పరిస్థితులను బట్టి మధ్యాహ్న భోజనం మెనూ సవరించాలన్నారు. మునిసిపల్ టీచర్ల పీఎఫ్ సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. కోవిడ్ సమయంలో మరణించిన మోడల్ స్కూల్ టీచర్ల వారసులకు కారుణ్య నియామకాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ గౌరవాధ్యక్షులు రమణయ్య, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సుబ్బరాయుడు, సీనియర్ నాయకులు నాగేంద్ర, మండలాల నాయకులు పవన్ కుమార్, మహమ్మద్ గౌస్, గంగాధర్ పాల్గొన్నారు.

కనిపించని ప్రత్యామ్నాయం

- ప్రధాన పంటల సాగుకు ముగిసిన అదను
- 3.46 లక్షల హెక్టార్లకు గానూ 1.10 లక్షల హెక్టార్లలో విత్తు
- నేటి నుంచి ప్రత్యామ్నాయ పంటల సాగే దిక్కు
- ఆగస్టు వచ్చినా సిద్ధం కాని ప్రత్యామ్నాయ ప్రణాళిక
- బాబు సర్కార్ తీరుపై రైతుల మండిపాటు


ప్రత్యామ్నాయమే దిక్కు

అనంతపురం అగ్రికల్చర్: జూలై వర్షాలు ఖరీఫ్‌ను దారుణంగా దెబ్బతీశాయి. 63.9 మి.మీ గానూ 61.8 శాతం తక్కువతో కేవలం 24.4 మి.మీ వర్షపాతం నమోదైంది. కేవలం మూడంటే మూడు రోజులు (రెయినీ డేస్) మాత్రమే వర్షం కురిసింది. అది కూడా జూలై 14న 2.7 మి.మీ, 27న 2.6 మి.మీ, 30న 2.5 మి.మీ... ఇలా అతి తక్కువ సగటు వర్షపాతం నమోదు కావడం గమనార్హం. ఖరీఫ్‌లో పంటల సాగుకు కీలకమైన జూలైలో అరకొరగా కురిసిన తేలికపాటి వర్షాలకే అదను మీరిపోతుందనే ఆందోళనతో అక్కడక్కడ రైతులు పంటల సాగు చేపట్టారు. 3.46 లక్షల హెక్టార్ల (8,56,777 ఎకరాలు)లో పంటలు సాగులోకి రావాల్సి ఉండగా... 1.10 లక్షల హెక్టార్ల (2.75 లక్షల ఎకరాలు)లోనే రైతులు విత్తనం వేశారు. ఇంకా 2.36 లక్షల హెక్టార్లు (5.81 లక్షల ఎకరాలు) బీళ్లుగా కనిపిస్తున్నాయి.

ఖరీఫ్‌లో ప్రధాన పంటల సాగుకు మంచి అదను జూలై 20న ముగిసింది. అలాగే కొసరుగా భావించిన జూలై నెలాఖరు కూడా ముగిసిపోయింది. ఇక ఎట్టి పరిస్థితుల్లోనూ వేరుశనగ, కంది, పత్తి, ఆముదం లాంటి ప్రధాన పంటలు విత్తుకునేందుకు అవకాశం లేదు. దీంతో ప్రత్యామ్నాయమే శరణ్యంగా మారింది. ఇప్పటి వరకూ వేరుశనగ 1.98 లక్షల హెక్టార్లకు గానూ 22 శాతంతో 42 వేల హెక్టార్లు, కంది 37 వేల హెక్టార్లకు గానూ 65 శాతంతో 25 వేల హెక్టార్లు, పత్తి 48,500 హెక్టార్లకు గానూ 40 శాతంతో 20 వేల హెక్టార్లు, ఆముదం 16 వేల హెక్టార్లకు గానూ 51 శాతంతో 8,500 హెక్టార్లు, మొక్కజొన్న 11,500 హెక్టార్లకు గానూ 53 శాతంతో 6,200 హెక్టార్లలో సాగు చేశారు. సజ్జ 1,800 హెక్టార్లు, కొర్ర 2,400 హెక్టార్లు, మినుము 260 హెక్టార్లతో సాధారణ సాగు కన్నా అధికంగానే వేశారు. మిగిలిన జొన్న, పొద్దుతిరుగుడు, సోయాబీన్, పెసర, అలసంద, రాగి తదితర పంటలు నామమాత్రంగా సాగు చేసినట్లు వ్యవసాయశాఖ తాజా నివేదిక వెల్లడి చేస్తోంది.

రైతు సంక్షేమానికి తిలోదకాలు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రైతు సంక్షేమానికి సీఎం చంద్రబాబు తిలోదకాలిచ్చేశారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తోంది. అధికారం చేపట్టి నెల రోజులు కావస్తున్నా.. వ్యవసాయం, రైతు సంక్షేమం గురించి ఇంత వరకూ పట్టించుకోకపోవడంతో అన్నదాతలు ఆందోళనతో మండిపడుతున్నారు. రైతు భరోసా కింద పెట్టుబడి సాయం ఇవ్వలేదు, పంటల బీమా కింద పరిహారం ఇవ్వలేదు. కొత్తగా పంటల బీమా పథకాల గురించి ఊసేలేదు. ప్రత్యామ్నాయం కింద విత్తనాలకు అతీగతీ లేకపోవడంతో రైతుల పరిస్థితి దారుణంగా మారింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీజన్‌కు ముందే రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి నేరుగా పెట్టుబడి సాయాన్ని అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తూ వచ్చారని, ఉచిత పంటల బీమా పథకంతో తమకు అండగా నిలిచారంటూ నాటి వైఎస్ జగన్ పాలనను అనుక్షణం రైతులు గుర్తు చేసుకుని బాధపడుతున్నారు. చంద్రబాబు సర్కార్ తీరుతో వ్యవసాయానికి గడ్డు కాలం దాపురిస్తోందని మండిపడుతున్నారు.

సిద్ధం కాని ప్రణాళిక

ఆగస్టు వచ్చినా ప్రత్యామ్నాయ విత్తన ప్రణాళిక (కంటిన్‌జెంట్ సీడ్‌ప్లాన్) తయారు చేయకుండా వ్యవసాయశాఖ మొద్దునిద్ర పాటిస్తుండటం విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అటు జిల్లా కలెక్టర్ కూడా ఖరీఫ్ సాగు, ప్రత్యామ్నాయం గురించి వ్యవసాయశాఖకు దిశా నిర్దేశనం చేయకపోవడం విశేషం. సాధారణంగా జూలై 15 తర్వాత రెండు, మూడు వేర్వేరు ప్రత్యామ్నాయ ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాల్సి ఉంది. అయితే ఈసారి చంద్రబాబు సర్కార్ ఉదాసీన వైఖరి కారణంగా ప్రత్యామ్నాయ ప్రణాళిక వైపు వ్యవసాయశాఖ అధికారులు దృష్టి సారించలేదనే ఆరోపణలున్నాయి. కాగా, ఆగస్టులో 83.8 మి.మీ మేర సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. మరి ఏ మేర వర్షాలు నమోదవుతాయి. ప్రత్యామ్నాయానికి ఉపయోగపడుతుందా... రైతులకు ఎంత వరకు మేలు జరుగుతుంది అనేది వేచి చూడాల్సిన పరిస్థితి.

హెచ్చ్ఎన్ఎస్ఎస్‌కు 40 టీఎంసీలు


వినతిని పరిశీలిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం టవర్‌క్లాక్: హంద్రీ-నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) ప్రాజెక్ట్‌కు ఈ ఏడాది 40 టీఎంసీల నీటిని కేటాయించామని, ఈ నీరు సాధ్యమైనంత త్వరగా జిల్లాకు చేరేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశించారు. హెచ్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్ట్ స్థితిగతులపై అనంతపురంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులతో బుధవారం ఆయన సమీక్షించారు. హెచ్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్ట్ ప్రిలిమినరీ స్టేటస్‌పై ఆరా తీశారు. పెండింగ్ పనుల పూర్తిపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో హెచ్ఎన్ఎస్ఎస్ సీఈ నాగరాజు, ఎస్ఈ దేశేనాయక్, ఈఈ, డీఈలు, జేఈలు పాల్గొన్నారు.

రెండో రోజూ ప్రజాదర్బార్

స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మంత్రి పయ్యావుల కేశవ్ బుధవారం రెండో రోజూ ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై వినతులు స్వీకరించి, పరిష్కారానికి చొరవ తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

ఆత్మకూరు బైపాస్‌లో హిజ్రాల దౌర్జన్యం

ఆత్మకూరు: యాచన పేరుతో కొందరు హిజ్రాలు దారి దోపిడీకి తెరలేపారు. ఒంటరిగా వాహనదారులు కనిపిస్తే జేబులో ఉన్న మొత్తం నగదు దోచేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం ఆత్మకూరు బైపాస్‌లో ఓ వాహనదారుడు నిలువు దోపిడీకి గురయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... పి.యాలేరు గ్రామానికి చెందిన ఓ యువకుడు అత్యవసర పనిపై బుధవారం ద్విచక్ర వాహనంపై అనంతపురానికి బయలుదేరాడు. ఆత్మకూరు శివారులోని బైపాస్ క్రాస్ వద్ద అప్పటికే వాహనదారులను అడ్డుకుని బలవంతంగా డబ్బు వసూలు చేస్తున్న నలుగురు హిజ్రాలు... సదరు ఆపి డబ్బు ఇవ్వాలని అడిగారు. తనకు తోచినంత ఇచ్చేందుకు ఆ యువకుడు సిద్ధమవుతుండగా జేబులోని రూ.3 వేలును లాగేసుకున్నారు. దీంతో కంగుతిన్న ఆ యువకుడు తన డబ్బు ఇవ్వాలని ప్రాధేయపడినా వారు ససేమిరా అన్నారు. వారి చేష్టలతో విసుగు చెందిన బాధితుడు నేరుగా పోలీసు స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేయడంతో కానిస్టేబుళ్లు వెంటనే అక్కడకు చేరుకున్నారు. పోలీసులను చూడగానే హిజ్రాలు పరుగుదీశారు. వారిని వెంబండించి అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బాధితుడి నుంచి లాక్కొన్న డబ్బును తిరిగి ఇప్పించారు. మరో సారి ఇలా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి వదిలేశారు.

ఆస్పత్రిలో విశ్రాంతి ధామం ఏర్పాటుకు చర్యలు


ఆస్పత్రి మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో విశ్రాంతి ధామం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన ఆస్పత్రిని సందర్శించి, మ్యాప్‌ను పరిశీలించారు. ఏయే వార్డులో ఎక్కడెక్కడ ఉన్నాయి, లోపాలు, మౌలిక సదుపాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, తన పుస్తకంలో నమోదు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోగుల సంబంధీకులు విశ్రాంతి ధామం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వివిధ పథకాల కింద బోధనాస్పత్రికి నిధులను తీసుకువచ్చి ఆగిపోయిన పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. సీఎస్ఆర్ యాక్టివిటీ కింద ఎవరైనా నిధులను ఇస్తే ఆస్పత్రి అభివృద్ధి సొసైటీ నేతృత్వంలో ఆయా పనులు పూర్తి చేస్తామన్నారు. అంతకు ముందు ఆయన ఆస్పత్రిలోని ఓపీ బ్లాక్, క్యాజువాలిటీని పరిశీలించారు. క్యాజువాలిటీలో ఇబ్బందులపై ఆరా తీశారు. ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగంలో మౌలిక సదుపాయాలు లేవని కలెక్టర్‌కు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు వివరించారు. ఆస్పత్రి వెనుక వైపు గుట్టలుగా పడేసిన విరిగిన మంచాలు, ఇతర సామగ్రిని గమనించి వాటిని వేలం వేయాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఆప్తమాలజీ ఓటీ ఎదురుగా అర్ధంతరంగా ఆగిన మెడికల్ బ్లాక్ పనులపై ఈఈ శ్రీనివాసులునాయుడును అడిగి తెలుసుకున్నారు. జిల్లా క్షయ నివారణ సంస్థ కార్యాలయంలో అందే సేవలపై పీఓడీటీటీ డాక్టర్ సుజాతను అడిగి తెలుసుకున్నారు. గైనిక్, చిన్న పిల్లల విభాగం సేవలను అత్యధికులు వినియోగించుకుంటున్నారని, గైనిక్‌లో ఏమైనా అత్యవసర సమస్యలుంటే వాటి పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం ఇవ్వాలని హెచ్ఓడీ డాక్టర్ షంషాద్‌బేగంను కలెక్టర్ ఆదేశించారు.

రికార్డు గదులకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి

అనంతపురం అర్బన్: ఆర్డీఓ, తహసీల్దారు కార్యాలయాల్లో రికార్డులు భద్రపరిచిన గదులకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. రికార్డుల భద్రత అంశంపై బుధవారం తన క్యాంపు కార్యాలయం నుంచి డీఆర్వో రామకృష్ణారెడ్డి, ఆర్డీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కలెక్టరేట్, ఆర్డీఓ, తహసీల్దారు కార్యాలయాల వద్ద రాత్రి సమయాల్లో పోలీసుల గస్తీ ఉండేలా చూడాలన్నారు. రికార్డులకు సంబంధించి ఏదేని సమస్య వస్తే సంబంధిత అధికారులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

సరుకుల పంపిణీ చేపట్టాలి

ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా గురువారం నుంచి బియ్యం, నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రేషన్ పంపిణీ అంశంపై బుధవారం తన క్యాంపు కార్యాలయం నుంచి డీఆర్వో రామకృష్ణారెడ్డి, పౌర సరఫరాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. తాడిపత్రిలో చౌక దుకాణాలకు బియ్యం, సరుకులు చేరవేత ప్రక్రియ మందకొడిగా సాగుతోందని, అక్కడి ఏదేని సమస్య ఉంటే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కంబదూరు, కళ్యాణదుర్గం తదితర ప్రాంతాల్లోనూ చౌక దుకాణాలకు బియ్యం చేరవేతలో జాప్యం చోటు చేసుకుంటున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు.

మార్కెట్ యార్డును సందర్శించిన కలెక్టర్

అనంతపురం అగ్రికల్చర్: స్థానికవ్యవసాయ మార్కెట్ యార్డును కలెక్టర్ వినోద్‌కుమార్ బుధవారం సందర్శించారు. మార్కెటింగ్ శాఖ ఏడీ బి.సత్యనారాయణచౌదరి, యార్డు సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మితో కలసి యార్డు ప్రాంగణంలో కలియ తిరిగారు. ప్రధానంగా చీనీ మార్కెట్‌లో క్రయవిక్రయాలు, గిట్టుబాటు ధరలపై వ్యాపారులు, రైతులతో ఆరా తీశారు. అలాగే ఈ-నామ్ విధానాన్ని, కొత్తగా నిర్మించిన ఓపెన్‌షెడ్, మూతపడిన చీనీ గ్రేడింగ్‌మిషన్, ఖాళీగా ఉన్న గోదాములు, పశువులు, జీవాల సంతల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు అందిస్తున్న సేవలు, సదుపాయాలను పరిశీలించారు.

సజావుగా ఆలయ భూముల వేలం


వేలం నిర్వహిస్తున్న దేవదాయశాఖ అధికారులు

అనంతపురం కల్చరల్: అన్యాక్రాంతమైన దేవదాయ శాఖ భూముల వేలం ప్రక్రియ బుధవారం పోలీసు బందోబస్తు నడుమ ప్రశాంతంగా ముగిసింది. అనంతపురంలోని మొదటిరోడ్డులో ఉన్న కాశీవిశ్వేశ్వరాలయంలో వేలం ప్రక్రియ సాగింది. ఇటుకలపల్లి గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి, చెన్నకేశవస్వామి దేవస్థానాలకు చెందిన మాన్యం భూములకు వేలం నిర్వహించి కౌలుకు ఇచ్చారు. గ్రూపు ఆలయాల ఈఓ రామాంజనేయులు, ఎండోమెంటు తనిఖీ అధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... పాతికేళ్లుగా ఇతరుల ఆధీనంలో ఉన్న ప్రాచీన ఆలయాలకు సంబంధించిన 44.83 ఎకరాల మాన్యం భూమి స్వాధీనం చేసుకుని వేలం నిర్వహించినట్లు వివరించారు. ఈ భూముల ద్వారా ఏడాదికి రూ.95,200 కౌలు ఆదాయం సమకూరుతోందన్నారు.

మూడు లారీలు ఢీ - ఒకరి మృతి

పెనుకొండ రూరల్: వరుసగా మూడు లారీలు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని కోలార్ నుంచి టమాట లోడుతో హైదరాబాద్‌కు బయలుదేరిన లారీ... మంగళవారం అర్ధరాత్రి పెనుకొండ మండలం కొత్తచెరువు బ్రిడ్జి సమీపంలోకి చేరుకోగానే 44వ జాతీయ రహదారిపై డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో డివైడర్‌ను ఢీకొంది. అక్కడితో ఆగకుండా డివైడర్‌ను దాటుకుని ముందుకు వెళ్లిన లారీ చత్తీస్‌ఘడ్ నుంచి బెంగళూరుకు బంగాళదుంపలతో వెళుతున్న లారీని ఎదురుగా ఢీకొని ఒకదానిని మరొకటి తోసుకుంటూ వెనుకే ఉన్న కంటైనర్‌ను గుద్దుకున్నాయి. ఘటనలో కోలార్ జిల్లా మాలూరుకు చెందిన లారీ డ్రైవర్ ఎం.శ్రీనివాస్ (35) మృతి చెందాడు. స్వల్ప గాయలతో క్లీనర్ ముత్తు బయటపడ్డాడు. చత్తీస్‌ఘడ్ నుంచి వెళుతున్న లారీలో డ్రైవర్ శశికుమార్, క్లీనర్ గౌరప్పకు స్వల్ప గాయాలయ్యాయి. ఘటనపై కియా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతుడు శ్రీనివాస్‌కు భార్య కళావతి, ఇద్దరు కుమారులున్నట్లు సమాచారం.

వైఎస్సార్‌సీపీ మద్దతుదారులపై కొడవళ్లతో దాడి


తీవ్రంగా గాయపడిన నీలకంఠ, సంజీవ్

గుంతకల్లు రూరల్: మండలంలోని కసాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కురుబ రామాంజనేయులు కుమారులు నీలకంఠ, సంజీవ్‌పై బుధవారం సాయంత్రం అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రమేష్, ఆయన కుటుంబసభ్యులు కొడవళ్లు, కట్టెలతో దాడి చేశారు. నీలకంఠ తలకు తీవ్రగాయాలయ్యాయి. సంజీవ్ చెయ్యి విరిగింది. బాధితులు తెలిపిన మేరకు... గొర్రెల పోషణతో కుటుంబాన్ని పోషించుకుంటున్న రామాంజనేయులు... ఊరు వాకిలి సమీపంలో దొడ్డిలో రాత్రి సమయంలో గొర్రెలను విడిచేవాడు. ఆ పక్కనే ఉన్న దొడ్డిలో టీడీపీ నాయకుడు వడ్డే రమేష్ తన గొర్రెలను విడిచేవాడు. ఈ క్రమంలో దొడ్డి స్థలం విషయంగా ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకునేది. దీంతో కక్ష పెంచుకున్న రమేష్ వర్గీయులు అవకాశం కోసం కాచుకుని ఉన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి 7 గంటలకు గొర్రెలను దొడ్డిలో వదిలి ఇంటికి వెళుతున్న నీలకంఠ, సంజీవ్‌పై దాడికి తెగబడ్డారు. ఇద్దరి కళ్లలోకి రమేష్ ఆయన తమ్ముడు చంద్ర, కుమారుడు తిరుమలేష్ మరికొందరు కారం కొట్టి కొడవళ్లు, కర్రలతో విచక్షణారహితంగా దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన వారిని కుటుంబసభ్యులు వెంటనే గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు తెలిపారు.

రేషన్ సరుకులు పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు

ఉరవకొండ: రేషన్ బియ్యం, ఇతర సరుకులను పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీలర్లను ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి (డీఎస్ఓ) శోభారాణి హెచ్చరించారు. బుధవారం ఉరవకొండ మార్కెట్ యార్డు ఆవరణలో ఉన్న స్టాక్ పాయింట్‌ను వారు తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, స్టాక్ పాయింట్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్‌కు పలు సూచనలు చేశారు. అనంతరం డీఎస్ఓ మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా 460 రేషన్ షాపులు ఉండగా వీటి పరిధిలో ఎండీయూ వాహనాల ద్వారా రేషన్‌ను అందిస్తున్నామన్నారు. ప్రస్తుతం జిల్లాలోని ఒక్క స్టాక్ పాయింట్‌కు మాత్రమే 30 మెట్రిక్ టన్నుల రాగులు వచ్చాయని, మిగిలిన స్టాక్ పాయింట్లకూ త్వరలో అందుబాటులోకి వస్తాయన్నారు. కార్డుదారుడికి బియ్యంతో పాటు 3 కిలోల రాగులు, జొన్నలు అందిస్తామన్నారు. అనంతరం ఆర్డీఓ అధ్యక్షతన తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశమై మాట్లాడారు.

అస్మదీయుల కోసం అడ్డగోలు నిర్ణయం

- సమగ్ర శిక్షలో ఒకేసారి 10 మంది ఉద్యోగుల రీప్యాట్రియేషన్
- సెక్టోరియల్ ఆఫీసర్లు ఖాళీ
- కలెక్టర్‌ను బురిడీ కొట్టించిన విద్యాశాఖ అధికారులు
- ఆగమేఘాలపై ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ జారీ
- రూల్స్ అంటూనే ఓ అధికారి డ్రామా

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్ర శిక్షలో భారీ కుదుపు సంభవించింది. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ఏకంగా ఒకేసారి 10 మంది ఉద్యోగులను రీప్యాట్రియేషన్ (రిలీవ్) చేస్తూ కలెక్టర్ వినోద్ కుమార్ నిర్ణయం తీసుకున్నారు. వీరిలో ఎనిమిది మంది సెక్టోరియల్ ఆఫీసర్లు, ఇద్దరు నాన్ టీచింగ్ ఉద్యోగులు ఉన్నారు. దీనివెనుక విద్యాశాఖలో కొందరి అధికారులు మంత్రాంగం నడిపారనే ప్రచారం సాగుతోంది. అసలు విషయం చెప్పకుండా కలెక్టర్‌ను బురిడీ కొట్టించినట్లు తెలిసింది.

మధ్యలో రిలీవ్ చేయొద్దన్నా..

సమగ్ర ప్రాజెక్టులోకి కొత్తగా ఫారెన్ సర్వీస్ కింద తీసుకునే ఉద్యోగులకు సంబంధించి విధివిధానాలు రూపొందించి ఈ ఏడాది ఏప్రిల్ 18న విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం పని చేస్తున్న వారిని తప్పించమని ఎక్కడా చెప్పలేదు. కొత్తగా తీసుకునే వారి విషయంలో అమలు చేయాల్సి ఉంది. అలాగే ఎవరినైనా తప్పించాల్సి వస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యా సంవత్సరం మధ్యలో రిలీవ్ చేయొద్దని స్పష్టంగా పేర్కొన్నారు. ఈ రెండు నిబంధనలు పాటించకుండా కలెక్టర్‌కు ఫైలు పెట్టారు. ఈ క్రమంలో సెక్టోరియల్ ఆఫీసర్లు చంద్రశేఖర్‌రెడ్డి, గోపాలకృష్ణ, గోవిందరెడ్డి, షమా, మహేశ్వరి, అసిస్టెంట్ సెక్టోరియల్ ఆఫీసర్లు మాధవరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, ఏఎస్ఓ రాంప్రసాద్‌రెడ్డిని రిలీవ్ చేస్తూ కలెక్టర్ నిర్ణయం తీసుకున్నారు. మొత్తం సమగ్రశిక్షలో సెక్టోరియల్ ఆఫీసర్లందరూ ఖాళీ చేయనున్నారు. కమిషనర్ జారీ చేసిన నిబంధనల ప్రకారమే ఉన్నవారిని తప్పించాలనే ఉంటే తక్కిన 25 జిల్లాల్లో ఎక్కడా అమలు చేయలేదు. మూడేళ్లు పూర్తయిన వారిని మాత్రమే రిలీవ్ చేశారు. కొన్ని జిల్లాల్లో సెక్టోరియల్ ఆఫీసర్లు స్వచ్ఛందగా వెనక్కు వెళ్లారు. కానీ ఇక్కడ మాత్రం అందుకు విరుద్ధంగా చర్యలు తీసుకున్నారు.

నాన్ టీచింగ్ ఉద్యోగులనూ..

వాస్తవానికి నాన్‌టీచింగ్ ఉద్యోగుల బదిలీల అంశం కలెక్టర్‌కు సంబంధం లేదు. విద్యాశాఖలో సీనియర్ అసిస్టెంట్ కేడర్ వరకు డీఈఓ పరిధిలోనే ఉంటాయి. ఇక్కడ తెలివిగా వారి మీదకు రాకుండా కలెక్టర్‌కు ఫైలు పెట్టి ఆమోదముద్ర వేయించారు. ఇదంతా ఓ అధికారి పక్కా ప్లాన్ రచించినట్లు తెలిసింది. రానున్న సాధారణ బదిలీల్లో తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సిన ఓ సీనియర్ అసిస్టెంట్ ప్రస్తుతం ధర్మవరం డీవైఈఓ కార్యాలయంలో పోస్టు ఖాళీగా ఉండడం గుర్తించి, ఇదే అదనుగా ఓ అధికారితో ఒప్పందం చేసుకుని కలెక్టర్‌కు ఫైలు పెట్టినట్లు సమాచారం. తాను రూల్స్ మేరకే వెళతా అంటూ బయటకు గట్టిగా చెబుతూనే లోలోన మాత్రం తనకు కావాల్సిన వారిని అందలం ఎక్కించేందుకు విద్యాశాఖలో ఓ అధికారి తీవ్రంగా శ్రమిస్తున్నారు. ప్రతిఫలంగా భారీగా తాయిలాలు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఆ అధికారికి ఇష్టమైన వస్తువులు కొనుగోలు కూడా చేసిచ్చినట్లు సమాచారం.

అప్పుడే ఖాళీల భర్తీకి నోటిఫికేషన్..

ఓవైపు సెక్టోరియల్ ఆఫీసర్లను రిలీవ్ చేయనేలేదు. అప్పుడే ఖాళీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలంటూ నోటిఫికేషన్ జారీ చేయడం వెనుక ఆంతర్యమేమిటో అధికారులకే తెలియాలి. ఖాళీల భర్తీకి ఏపీసీ నోటిఫికేషన్ విడుదల చేయడం పరిపాటి. ఇక్కడ మాత్రం ఓ అధికారి తన చేతికి మట్టి అంటకుండా అన్ని పనులు కలెక్టర్ ద్వారానే చేయిస్తున్నారు. ఈ నోటిఫికేషన్ కూడా కలెక్టర్ పేరుతో విడుదల చేశారు. అర్హులైన అభ్యర్థులు ఆగస్టు 9లోగా http://ramafrarhikrhaatp.bofrpot.com వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఫిజికల్ దరఖాస్తులను సమగ్ర శిక్ష కార్యాలయంలో అందజేయాలని సూచించారు. నోటిఫికేషన్ జారీకి కూడా ముందురోజే (30వ తేదీన) కలెక్టర్‌తో అనుమతులు తీసుకోవడం కొసమెరుపు.

మీ సేవలు అమూల్యం

అనంతపురం అర్బన్: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా ఉంటూ సుదీర్ఘకాలం మీరు అందించిన సేవలు అమూల్యమని ఉద్యోగ విరమణ చేసిన వారి సేవలను కలెక్టర్ వినోద్‌కుమార్ కొనియాడారు. వివిధ శాఖల్లో ఉద్యోగ విరమణ చేసిన వారికి బుధవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో సామూహిక ఉద్యోగ విరమణ మహోత్సవం నిర్వహించారు. ఉద్యోగ విరమణ చేసిన అధికారులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు కలెక్టర్ ధన్యావాదాలు తెలిపారు.


ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులతో కలెక్టర్ వినోద్‌కుమార్

క్లుప్తంగా

ఉపాధి పనులు కల్పించాలి



మాట్లాడుతున్న అధికారులు

ఆత్మకూరు: గ్రామాల్లోని ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించాలని ఎంపీడీఓ దశరథరామయ్య, ఏపీఓ పుష్ప సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం జిల్లా కలెక్టర్ ఫాంపాండ్స్‌పై ఎక్కువ దృష్టి పెట్టాలని సూచినట్లు తెలిపారు. గ్రామాల్లో రైతులతో మాట్లాడి ఫాంపాండ్లపై అవగాహన కల్పించాలన్నారు. మండలంలో ప్రస్తుతం 290 ఎకరాల్లో పండ్ల తోటల మొక్కల సాగుకు అనుమతులు వచ్చాయని పేర్కొన్నారు. ఇప్పటికే 280 ఎకరాల్లో పండ్ల మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉపాధి కూలీలకు పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈసీ భాస్కర్, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేడు పూజా సామగ్రి విక్రయహక్కులకు వేలం

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో పూజా సామగ్రి విక్రయహక్కులకు గురువారం బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆలయ సిబ్బంది బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఉదయం 10 గంటల్లోపు ఆలయం వద్దకు చేరుకోవాలని సూచించారు.

కౌలుదారులకు గుర్తింపు కార్డులు



మాట్లాడుతున్న రూరల్ ఏఓ జె.శశికళ

అనంతపురం అగ్రికల్చర్: ప్రభుత్వం అందించే క్రాప్ కల్టివేషన్ రైట్ కార్డు (సీసీఆర్సీ) ద్వారా కౌలురైతులు ప్రయోజనాలు పొందాలని రూరల్ మండలం వ్యవసాయాధికారి జె.శశికళ తెలిపారు. బుధవారం మండల పరిధిలో పూలకుంట, చియ్యేడు గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో ఏఈఓ మురళీక్రిష్ణతో కలిసి కౌలు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అర్హత కలిగిన వారికి గుర్తింపు కార్డులు ఇస్తామన్నారు. వీటి ద్వారా ప్రభుత్వం ద్వారా వివిధ రూపాల్లో ప్రయోజనం పొందడానికి అర్హత ఉంటుందని తెలిపారు. ఖరీఫ్‌లో వర్షపాతం, పంటల సాగుపై ఆరా తీశారు. అలాగే ఆగస్టులో ప్రత్యామ్నాయంగా ఏ పంటలు వేసుకుంటారు? ఏ రకం విత్తనాలు కావాలనే దానిపై రైతులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లి అవసరమైన విత్తనాలు, ఇతరత్రా సాయం అందించడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

గ్రంథాలయాధికారికి వీడ్కోలు



కృష్ణయ్య దంపతులను సన్మానించిన దృశ్యం

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో గ్రంథాలయాధికారిగా పని చేస్తున్న కృష్ణయ్య బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ.. కృష్ణయ్య అంకితభావంతో విధులు నిర్వర్తించారన్నారు. అనంతరం కృష్ణయ్య దంపతులను పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, రిటైర్డ్ హెచ్ఎం రంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, సంఘం అసోసియేట్ అధ్యక్షుడు రవికుమార్ నాయుడు గ్రంథాలయాధికారులు పాల్గొన్నారు.

డీఎస్సీ కోచింగ్ ఇవ్వాలి



డీడీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అనంతపురం రూరల్: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువతకు డీఎస్సీ, గ్రూప్–2 పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వాలని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు నెరమెట్ల ఎల్లన్న తదితరులు సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూకొఠారీని కోరారు. ఈ మేరకు బుధవారం డీడీని కలసి వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో నిరుద్యోగ యువతకు సరైన ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రైవేట్ కోచింగ్ తీసుకునే ఆర్థిక స్థోమత లేకపోవడంతో నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని తెలిపారు. వీటన్నింటీని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని డీఎస్సీతో పాటు అన్ని పోటీ పరీక్షలకు శిక్షణ తరగుతులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కేపీ నారాయణస్వామి, రామాంజనేయులు, మనోజ్‌కుమార్, నరసింహులు, శివ పాల్గొన్నారు.

అన్నదాత నష్టాలపాలు

- కలసిరాని కళింగర, దోస సాగు
- నామమాత్రంగా దిగుబడి
- పాతాళానికి పడిపోయిన ధరలు
- పెట్టుబడులు తిరిగి రావంటున్న రైతులు

చెన్నేకొత్తపల్లి: మండలంలో కళింగర, దోస సాగు చేసిన రైతులకు కాలం కలిసిరాలేదు. పంట దిగుబడి లేక ధరలు కూడా పతనం కావడంతో నష్టాలపాలవుతున్నారు. గతంలో ధరలు ఆశాజనకంగా ఉండటంతో ఎక్కువ మంది రైతులు కళింగర, దోస సాగుకు ఆసక్తి చూపారు. వాణిజ్య పంటలు సాగు చేస్తే తక్కువ కాలవ్యవధిలో పంట చేతికొస్తుంది. ఆదాయం కూడా ఆర్జించవచ్చనే ఉద్దేశంతో అప్పులు తెచ్చీ మరి పంటలు సాగు చేశారు. చెన్నేకొత్తపల్లి మండల వ్యాప్తంగా దాదాపు 200 ఎకరాల్లో దోస, దాదాపు 250 ఎకరాల్లో కళింగర సాగుకు శ్రీకారం చుట్టారు. ఈ పంటలను ఎకరా విస్తీర్ణంలో సాగు చేసేందుకు సుమారు రూ.70 వేల నుంచి 80 వేల వరకు పెట్టుబడి పెట్టారు. విత్తనాలు విత్తడం నుంచి ఎరువులు చల్లి పంటను జాగ్రత్తగా చూసుకున్నారు. చీడపీడలు సోకకుండా రసాయన మందులు పిచికారీ చేశారు. పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. అయితే దోస, కళింగర దిగుబడి ఆశించిన స్థాయిలో రాలేదు. గతంలో కంటే ధరలు ప్రస్తుతం భారీగా పడిపోయాయి. ఢిల్లీ రకం దోస కిలో రూ.3 పలుకుతోంది. కళింగర కిలో రూ.7 పలుకుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ధరలు ఉంటే పెట్టిన పెట్టుబడి కూడా చేతికి రాదని చెబుతున్నారు. ఎరువులను వాడటం వలన ఎకరా విస్తీర్ణంలో సుమారు పది టన్నుల వరకు



మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధం చేసిన ఢిల్లీ రకం దోసకాయలు

వచ్చేది. వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో ఐదు టన్నుల వరకు మాత్రమే దిగుబడి వస్తోందని రైతులు తెలిపారు.

పంట కాలం 60 రోజులు

దోస, కళింగర సాగు చేసిన తరువాత అరవై రోజులకు పంట కోతకు వస్తుంది. కోతల తరువాత వ్యాపారులు కాయలను మార్కెట్‌కు తరలించేందుకు కనీసం 3 నుంచి 4 రోజులు పడుతుంది. ఇక ఢిల్లీ రకం దోసకాయలను మార్కెట్‌కు తరలించడానికి వారం రోజులకు పైగా సమయం పడుతుంది. ఇందుకోసం వ్యాపారులు



కళింగర కాయలను తొలగిస్తున్న కూలీలు

పది రోజులు ముందుగానే కోతలు ప్రారంభిస్తారు. దోస, కళింగరను నాగపూర్, కలకత్తా, శ్రీనగర్‌తో పాటు దుబాయ్, నేపాల్ దేశాలకు తరలిస్తారని రైతులు చెబుతున్నారు.

కన్నీరే మిగిలింది..



దోస, కళింగరకు గతంలో ధరలు ఆశాజనకంగా ఉండటంతో మంచి లాభం వస్తుందని 10 ఎకరాల్లో కళింగర సాగు చేశాను. ఇందుకోసం రూ.10 లక్షల వరకూ ఖర్చు పెట్టుకున్నారు. అయితే ఆశించిన పంట దిగుబడి రాలేదు. కళింగర ప్రస్తుతం కిలో రూ.7 పలుకుతోంది. ఆ లెక్కన చూస్తే పంటల సాగుకు చేసిన పెట్టుబడులు రాలేదు. ఆర్థికంగా నష్ట పోతున్నాం.

– నారాయణ స్వామి, రైతు, చెన్నేకొత్తపల్లి

పెట్టుబడి కూడా రాలేదు..



నాకున్న ఐదు ఎకరాల్లో ఢిల్లీ రకం దోస సాగు చేశాను. విత్తనాలు, పురుగుమందు, కూలీల ఖర్చులు తదితర పనుల కోసం రూ.3,50,000 వరకూ ఖర్చు చేయడం జరిగింది. సాధరణంగా ఎకరాకు పది టన్నుల వరకూ దిగుబడి వస్తుందని ఆశించాను. అయితే వాతావరణం అనుకూలించక పోవడంతో దాదాపు ఐదు టన్నుల వరకూ దిగుబడి వచ్చింది. ధర కిలో రూ.3 పలకడంతో పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు.

– రాంగోపాల్ రెడ్డి, వెంకటంపల్లి

శేష జీవితం ప్రశాంతంగా గడపాలి

అనంతపురం సిటీ: ఉద్యోగ విరమణ అనంతరం శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలసి ప్రశాంతంగా గడపాలని ఉభయ జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఆకాంక్షించారు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ బుధవారం ఉద్యోగ విరమణ చేసిన పద్మావతిని జెడ్పీ సమావేశ మందిరంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ.. రిటైర్మెంట్ అనంతరం ఉద్యోగులు కుటుంబ సభ్యులతో ఎక్కువగా గడపాలని సూచించారు. పద్మావతికి రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు తొందరగా అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సీఈఓ ప్రభాకర్ రావు, డిప్యూటీ సీఈఓ లలితబాయి, ఏఓలు



జూనియర్ అసిస్టెంట్ పద్మావతిని సన్మానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

నాగేంద్ర, భాస్కర్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం పద్మావతిని పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోండి

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యాశాఖ అధికారులు మామూళ్ల మత్తు వీడి నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్‌యూఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం అనంతపురం డీవైఈఓ శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఓబులేసు మాట్లాడుతూ.. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యావ్యవస్థను ఒక మాఫియాగా తయారు చేశాయన్నారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ ఒక బ్రాంచికి పర్మిషన్లు తీసుకుని వాటి పేరుమీద రెండు మూడు బ్రాంచ్‌లను ఏర్పాటు చేశాయన్నారు. నగరంలో ప్రధానంగా నారాయణ, చైతన్య విద్యాసంస్థలు పదుల సంఖ్యలో బ్రాంచ్‌లు ఏర్పాటు చేసుకొని దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. ఫీజులు, యూనిఫాం,



డీవైఈఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎస్‌యూఐ నాయకులు

పుస్తకాల పేరుతో దోచుకుంటున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీవైఈఓను కలిసిన వారిలో ఎస్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షులు రావులచెరువు సురేష్, ప్రదీప్, రాజు ఉన్నారు.

చాంద్‌బాషా సేవలు అమూల్యం

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో గత కొన్నేళ్లుగా ఎలక్ట్రీషియన్‌గా సేవలందించిన చాంద్‌బాషా సేవలు మరువలేనివని మేయర్ వసీం పేర్కొన్నారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ.. ఉద్యోగ విరమణ చేసిన చాంద్‌బాషాను సన్మానంచారు. మేయర్ మాట్లాడుతూ.. ప్రతి ఉద్యోగికి జీవితంలో ఉద్యోగ విరమణ తప్పనిసరి అన్నారు. చాంద్‌బాషా శేష జీవితం సంతోషంగా సాగాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కమిషనర్ పీవీవీఎస్ మూర్తి, అదనపు కమిషనర్ శ్రీహరిబాబు, డిప్యూటీ కమిషనర్ వెంకటేశులు, కార్యదర్శి సంగం శ్రీనివా



చాంద్‌బాషా దంపతులను సన్మానిస్తున్న మేయర్ వసీం

సులు, ఈఈ సుధారాణి, డీఈ దాక్షాయణి, ఏఈ ఉమామహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

రాప్తాడు: రైతులు తాము పండించిన పంటలను మండల రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకారం సంఘం లిమిటెడ్‌కు తక్కువగా అమ్మకాలు చేస్తున్నారు. అలా కాకుండా పంటల విక్రయాలు పెరిగి, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఏఎల్‌పీ కో–ఆర్డినేటర్ రిజ్వానా పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఎం.బండమీదపల్లి గ్రామంలో ఆర్డీటీ ఏకాలజీ ఆధ్వర్యంలో మండల రైతు ఉత్పత్తి దారుల పరస్పర సహకారం సంఘం ఎనిమిదో వార్షిక మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకారం సంఘం బలపడాలంటే వాటాదారుల పాత్ర, బాధ్యతలు, ఉండాల్సిన విధానాలపైన అవగాహన కల్పించారు.



మాట్లాడుతున్న ఏఎల్‌పీ కో–ఆర్డినేటర్ రిజ్వానా

కార్యక్రమంలో ఏఫ్ ఎకాలజీ ఎంటీఎల్ ఇంద్రజ, ఎఫ్‌పీఓ కోఆర్డినేటర్ శంకర్ నాయక్, కమ్యూనికేషన్ ఆఫీసర్ రమేష్, కార్యక్రమంలో రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకారం సభ్యులు, వాటాదారులు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. గిరిజా కల్యాణం



దేవతామూర్తుల వేషధారణలో కళాకారులు

అనంతపురం కల్చరల్: శ్రీరామకృష్ణ సేవా సమితి 20వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక మూడవ రోడ్డులోని జీఆర్ ఫంక్షన్ హాలు వేదికగా సాగుతున్న ఆధ్యాత్మిక ప్రవచనాలు బుధవారం ముగిశాయి. ఉదయం సాయిట్రస్టు ఆధ్వర్యంలో శ్రీశైలం, తిరుమల, అలంపూర్ క్షేత్రాల నుంచి విచ్చేసిన వేదపండితులతో కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ప్రముఖ ప్రవచనకర్త సామవేదం షణ్ముఖ శర్మ పర్యవేక్షణలో రుత్వికులు అమ్మవారి సారె సమర్పించారు. గురు దంపతులనే శివపార్వతులుగా భావించి సారె సమర్పించి, ఒడిబియ్యాన్ని భక్తులే స్వయంగా నివేదించారు. సాయంత్రం శ్రీనృత్యకళానిలయం సంధ్యామూర్తి శిష్యబృందం శివపదం నృత్యరూపకాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. 28 మంది కళాకారులు కైలాసంలోని వివిధ దేవతామూర్తుల వేష



కల్యాణం జరిపిస్తున్న సామవేదం షణ్ముఖ శర్మ

ధారణలతో చేసిన నాట్య విన్యాసాలు ఆకట్టుకున్నాయి. షణ్ముఖశర్మ శివసాక్షాత్కారం అనే అంశంపై మహేశ్వరుడి లీలావిశేషాలను తెలియజేసి ప్రవచనాలను ముగించారు. నిర్వాహకులు ప్రవచనకర్తను, కళాకారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జడ్జి శోభారాణి, రామకృష్ణ సేవా సమితి ప్రతినిధులు డాక్టర్ కృష్ణ శశి, ప్రవీణ్‌కుమార్, శ్రీధరమూర్తి, విజయ్‌సాయి, బ్రాహ్మణ సంఘం నాయకులు శ్రీనిధి రఘు, ఇన్నర్‌వీల్ సంస్థ శ్రీవల్లి పాల్గొన్నారు.

ఘనంగా ప్రేమ్‌చంద్ జయంతి



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న కళాశాల వైస్ చైర్మన్ చక్రధర్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం సాహిత్యకారుడు ప్రేమ్‌చంద్ జయంతిని జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధర్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశం గర్వించదగ్గ గొప్ప సాహిత్యకారుడు ప్రేమ్‌చంద్ అన్నారు. ప్రేమ్‌చంద్ రచనల్లోని పాత్రల ఔన్నత్యాన్ని ప్రిన్సిపాల్ ఎస్.ప్రసాద్, హిందీ విభాగం అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ వివరించారు. అనంతరం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

ముగిసిన మొహర్రం



గొరిదిండ్లలో జలధికి తరలుతున్న పీర్లు

ఆత్మకూరు: మండలంలోని గొరిదిండ్ల గ్రామంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న మొహర్రం వేడుకలు బుధవారం ముగిశాయి. తొలుత పీర్ల స్వాములను అగ్నిగుండ ప్రవేశం చేయించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పీర్ల స్వాములను దర్శించుకుని చక్కెర చదివింపులు చేయించారు. గ్రామంలో పెద్ద ఎత్తున డప్పు కొట్టుకుంటూ చిందులు వేశారు. పండుగలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కేరళ హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్‌కు స్వాగతం

అనంతపురం: కేరళ, కలకత్తా, ముంబై హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ సి.మంజుల బుధవారం అనంతపురంలో పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి జి.శ్రీనివాస్, జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

ఎస్ఐ నాగరాజుకు వీడ్కోలు..

అనంతపురం: ఉద్యోగ విరమణ పొందాక శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని ఎస్పీ కేవీ మురళీకృష్ణ అన్నారు. జిల్లాలో పని చేస్తున్న ఎస్ఐ నాగరాజు బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఎస్ఐ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్పీ సీఏ ఇందిర, ఆర్ఐ మధు, జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలన అధికారి శంకర్, జిల్లా పోలీసు అధి



మాజీ చీఫ్ జస్టిస్ సి.మంజులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా జడ్జి జి. శ్రీనివాస్, ఎస్పీ కేవీ మురళీకృష్ణ

కారుల సంఘం అడ్‌హక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్ రెడ్డి, తేజ్‌పాల్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

4న టెట్ మోడల్ టెస్ట్

అనంతపురం ఎడ్యుకేషన్: టెట్, డీఎస్సీకి సన్నద్ధమవుతున్న ఉమ్మడి జిల్లాలోని వాల్మీకి, బోయ సామాజిక వర్గానికి చెందిన యువతకు వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 4న టెట్ మోడల్ టెస్ట్ నిర్వహించనున్నారు. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఆర్సీ అక్కులప్ప, ప్రధాన కార్యదర్శి చైతన్యకుమార్, ట్రెజరర్ పవన్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో వివరాలు వెల్లడించారు. అనంతపురం నగర శివారులోని వాల్మీకి కల్యాణ మంటపంలో ఈ మోడల్ టెస్ట్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ పరీక్షలో ప్రతిభ చాటిన వారికి ఉచితంగా డీఎస్సీ మెటీరియల్ పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. మరిన్ని వివరాలకు 94407 74519, 83090 90406 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఎరువుల దుకాణంపై విజిలెన్స్ దాడులు

అనంతపురం: బత్తలపల్లిలోని సంజయ్ ట్రేడర్స్ ఎరువుల దుకాణంలో జిల్లా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎం.మునిరామయ్య ఆదేశాల మేరకు బుధవారం సీఐ వెంకటరమణ, ఏఓ జె.వాసు తనిఖీలు చేపట్టారు. భౌతిక నిల్వలో వ్యత్యాసాలు గుర్తించారు. స్టాక్ బోర్డు, రిజిస్టర్ నిర్వహణ సరిగా లేదని నిర్ధారించుకున్నారు. అనంతరం రూ.69,930 విలువ చేసే 92.25 లీటర్ల క్రిమిసంహారక మందుల విక్రయాలకు స్టాప్ సేల్ నోటీసులు జారీ చేశారు.

ఎల్కేపీలో రేపు బళ్లారి రాఘవ జయంతి

అనంతపురం కల్చరల్: అనంత రంగస్థలానికి విశేష ఖ్యాతి తెచ్చిన మహనీయుడు బళ్లారి రాఘవ 144వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు లలిత కళాపరిషత్తు కార్యదర్శి పద్మజ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎల్కేపీలో ఈనెల 2న సాయంత్రం 5:30 గంటలకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే, ఎంపీలతో పాటూ పలువురు అధికారులు ముఖ్య అతిథులుగా హాజరై బళ్లారి రాఘవ అవార్డులకు ఎంపికైన వారిని పురస్కారాలతో ఘనంగా సత్కరిస్తారని తెలిపారు. ఈసారి రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి అవార్డులతో పాటూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు కన్నుల పండువగా సాగుతాయని కళాభిమానులందరూ విచ్చేయాలని కోరారు.

మహిళలు అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న మేరీవటమట్టం

చెన్నేకొత్తపల్లి: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని టింబక్ట్ కలెక్టివ్ సొసైటీ వ్యవస్థాపకురాలు మేరీ వటమట్టం సూచించారు. బుధవారం టింబక్ట్ కలెక్టివ్ సొసైటీ సీఈఓ రమీజా, సొసైటీ అధ్యక్షురాలు సుజాత అధ్యక్షతన 12వ వార్షిక మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మేరీ వటమట్టం మాట్లాడుతూ.. 9 మండలాల్లోని 333 గ్రామాల్లో 1,442 సంఘాలతో సొసైటీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నామన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగడంతో పాటు పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. అనంతరం సొసైటీ వార్షిక నివేదికలను సభ్యులకు చదివి వినిపించారు. కొన్నేళ్లుగా సొసైటీ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించిన వారిని సన్మానించారు. కార్యక్రమంలో సుకన్య, గౌరి, రవళి, పావని తదితరులు పాల్గొన్నారు.

హంద్రీనీవాకు నీరు విడుదల చేయండి

అనంతపురం సెంట్రల్: హంద్రీనీవాకు తక్షణమే నీటిని విడుదల చేయాలని నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం జాప్యం చేయడం ద్వారా ఇప్పటికే 2 టీఎంసీలు రాయలసీమ నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలు–ఆత్మకూరు రోడ్డు నిర్మాణం కోసం పైపులు కూడా వేయకుండా హంద్రీనీవా కాలువ పూడ్చివేశారని తెలిపారు. రాయలసీమలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని గుర్తు చేశారు. ఈ ఏడాది వీలైనన్ని ఎక్కువగా చెరువులు నింపేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని కోరారు.

రెండ్రోజుల్లో పింఛన్ అందజేయాలి

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని పింఛన్ లబ్ధిదారులందరికీ రెండు రోజుల్లో పింఛన్ పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందికి అదనపు కమిషనర్ శ్రీహరిబాబు ఆదేశించారు. మునిసిపల్ ఆర్‌డీ పీవీవీఎస్ మూర్తి ఆదేశానుసారంగా బుధవారం అదనపు కమిషనర్ శ్రీహరిబాబు, నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగరంలో మొత్తం 23,211 మందికి రూ.10.11 కోట్లు పంపిణీ చేయాల్సి ఉందన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ..

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా ఉన్న 5,893 మంది పింఛన్ లబ్ధిదారులకు గురువారం పింఛన్ సొమ్ము అందజేయనున్నట్లు ఎంపీడీఓ దశరథరామయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

